క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల విరాళం



వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని ఎస్సార్‌బీసీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు, అధ్యాపకులు వృద్ధులకు నిత్యావసర సరుకులను అందజేశారు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు విష్ణు, నాగ విజయ్, శివరాంరెడ్డి, నాజియా తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పని చేయాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని ఉపాధి కూలీలు కొలతల ప్రకారం పనిచేయాలని జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలలో ఎలాంటి పనులు కావాలో వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన హార్టికల్చర్‌కు సంబంధించి మునగ పంటను పరిశీలించి రైతులకు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ అలివేలు మంగమ్మ, ఈసీ షబాన, టీఏ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సర్వదేవతార్చన



వేదమంత్రాలతో హోమాధికార్యక్రమాలు నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామలక్ష్మణాంజనేయస్వామివార్ల ఆలయ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా మంగళవారం టీటీడీ దేవస్థాన అర్చకులు భక్తిశ్రద్ధలతో సర్వదేవతార్చన కార్యక్రమాలు నిర్వహించారు. తిరుమల–తిరుపతి దేవస్థానం ఈఓ ధర్మారెడ్డి దంపతులతో పాటు గ్రామస్తులు పూజాధికార్యక్రమాల్లో పాల్గొన్నారు. అర్చకులు ముక్తకంఠంతో వేదమంత్రాలు పఠిస్తూ పుణ్యాహవాచన, అగ్నిప్రణయనం, కుంభారాధన, ఉక్త, విశేష హోమాలు, నవకళశ, చతుర్థశకలశ, మహాశాంతి అభిషేకం, కుంభారాధన, శయనాధివాసం, అహోరాత్రప్రయోగం, హౌత్రం, సర్వదేవతార్చన తదితర విశేషపూజలు నిర్వహించారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

నందికొట్కూరు: ప్రతి ఒక్కరికి కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని ప్రిన్సిపాల్ డాక్టర్ సునిత అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐపీఎస్సీ కో ఆర్డినేటర్ డాక్టర్ షేక్ తాజుద్దీన్, అకాడమీ కో ఆర్డినేటర్ రఘుపతి రెడ్డి, నాక్‌కో ఆర్డినేటర్ డాక్టర్ పరిమళాదేవి తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి

జూపాడుబంగ్లా: గ్రామపంచాయతీ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామపంచాయతీ విధివిధానాలపై గ్రేడ్–1 నుంచి గ్రేడ్–6 పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, సీనియర్ పంచాయతీ కార్యదర్శి శాంతయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీ నిర్వహణకు సంబంధించి 32 రికార్డులను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అందులో క్యాష్‌బుక్, ఇంటి, కుళాయి పన్నుల వసూళ్లకు సంబంధించిన రికార్డులతో పాటు పంచాయతీ సమావేశాలు, అభివృద్ధి పనుల తీర్మానాలకు సంబంధించిన పుస్తకాలను సక్రమంగా నిర్వహించాలన్నారు.

సాధికార బస్సు యాత్ర ఉత్సాహాన్ని నింపింది

- విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు
- ఇదే స్ఫూర్తితో ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలి
- ఎథిక్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే శిల్పా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని గౌడ్‌సెంటర్‌లో ఇటీవల జరిగిన సాధికారత బస్సు యాత్ర తనతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిందని ఎథిక్స్ కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలో సాధికారిత బస్సు యాత్రను ఆత్మకూరు పట్టణం గౌడ్‌సెంటర్‌లో నిర్వహించామని, ఇందుకు ఆత్మకూరు పట్టణ, మండలం నుంచి నియోజకవర్గంలోని శ్రీశైలం, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు అభిమానులు తరలిరావడం ఎంతో సంతోషాన్ని నింపిందన్నారు.

జిల్లాలో ఎక్కడా లేనివిధంగా జనసందోహం

నల్లకాల్వ స్మృతివనం నుంచి ఆత్మకూరు పట్టణంలోని గౌడ్‌సెంటర్ సభావేదిక వరకు వేలాదిగా అభిమానులు తరలిరావడం అబ్బురపరిచిందని, యాత్రకు తరలివచ్చిన మంత్రులు, ప్రజాప్రతినిధులు అభిమానులను చూసి ఉత్సాహంతో పొంగిపోయారని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లాలో ఎక్కడ జరగని విధంగా ఆత్మకూరు పట్టణంలో భారీ జన సందోహం మధ్య యాత్ర విజయవంతం కావడం ఎంతో సంతోషం, సంతృప్తినిచ్చిందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. పేరు పేరున కార్యకర్తలకు కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, నాయకులు పువ్వాడ భాస్కర్, విజయచౌదరి, అంజాద్‌అలీ, సుధాకర్‌రెడ్డి, వెంకటస్వామిగౌడ్, ఆంజనేయులు, సుల్తాన్, పాన్‌బాష,జయకృష్ణ, వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు:

ఎమ్మెల్యే శిల్పాకు ఘన సన్మానం

పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎథిక్స్ కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డిని ఆర్యవైశ్య సంఘం పట్టణ, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఇటీవల రాష్ట్ర అటవీశాఖ హానరరీ వార్డెన్‌గా పువ్వాడ భాస్కర్‌ను ఎంపిక చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు కృష్ణమూర్తి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆర్యవైశ్యులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం హర్షించదగ్గవిషయమన్నారు. ర్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సూర్యనారాయణ, రామచంద్రయ్య, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం



ఈర్నపాడులో సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరించిన నాయకులు

మహానంది: అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పారదర్శక పాలన కొనసాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని బండిఆత్మకూరు ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ పథకాల ద్వారా ప్రజలకు అందిన సంక్షేమ లబ్ధి రూ. 25.72 కోట్లకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు దేసు వెంకటరామిరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు ముడిమెల పుల్లారెడ్డి, ఎస్సీడీసీఎల్ రాష్ట్ర డైరెక్టర్ శశికళారెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల వెంకట రమణ, సర్పంచ్ వెంకట లక్ష్మి, ఎంపీటీసీ పార్వతమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల అభివృద్ధి

ఆత్మకూరు: రాష్ట్రంలో పేదల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు పుల్లారెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవినాయక్ అన్నారు. మండలంలోని ముష్టపల్లి గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముష్టపల్లి సచివాలయ పరిధిలో వివిధ పథకాల ద్వారా రూ.24,01,29,567 నేరుగా ప్రజలకు అందాయన్నారు. వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించి, సంక్షేమ పథకా బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రవి, హనుమంతరెడ్డి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ముష్టపల్లిలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి

ఎంపీపీకి ఎమ్మెల్యే పరామర్శ



ఎంపీపీ తిరుపాలమ్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామంలో ఆత్మకూరు ఎంపీపీ తిరుపాలమ్మ భర్త నాగన్న రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి మంగళవారం ఎంపీపీ తిరుపాలమ్మను, కుటుంబసభ్యులను పరామర్శించారు. అన్ని విధాలుగా కుటుంబసభ్యులకు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. అలాగే మాజీ ఎంపీపీ మోహన్‌రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందడంతో పట్టణంలోని ఆయన గృహానికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, న్యాయవాది సుధాకర్‌రెడ్డి, భోగిరెడ్డి, వెలుగోడు ఎంపీపీ లాలం రమేష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పువ్వాడ భాస్కర్, పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి సురేష్ ఉన్నారు.

కర్నూలు వెళ్లి పింఛన్ పంపిణీ



ప్రశాంతికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ రాజు

పాములపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన గ్రామ వలంటీర్ వ్యవస్థ సేవలు భేష్ అని పించుకుంటున్నాయి. మండల కేంద్రానికి చెందిన ప్రశాంతి అనే వితంతు పింఛన్‌దారురాలు 3 నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలులో చికిత్స పొందుతోంది. ఆ పరిధి వలంటీర్ రాజు ప్రతి నెలా కర్నూలుకు వెళ్లి ఆ మహిళకు పింఛన్ సొమ్ము అందిస్తున్నాడు. మంగళవారం వర్షం సైతం లెక్కచేయకుండా కర్నూలుకు వెళ్లి పింఛన్ అందించి అందరిచే శబాష్ రాజు అనిపించుకున్నాడు.



కదిరి మల్లమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు భాస్కర్

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాకు చెందిన కదిరి మల్లమ్మ గుండెపోటు రావడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకొన్న వలంటీరు భాస్కర్ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ నగదు అందజేయడంతో ఆమె హర్షం వ్యక్తం చేశారు.

బడి ఈడు పిల్లలను గుర్తించాలి



గిరిజన కాలనీలో బడి ఈడు పిల్లల వివరాలు సేకరిస్తున్న పీఓ డాక్టర్ రవీంద్రారెడ్డి, తహసీల్దార్ రాజేంద్రసింగ్

శ్రీశైలంప్రాజెక్ట్: గ్రామాల్లో బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించాలని, ఏ గ్రామంలో కూడా డ్రాపౌట్స్‌గా ఉండరాదని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి రవీంద్రారెడ్డి, మండల తహసీల్దార్ రాజేంద్రసింగ్ అన్నారు. గ్రామసచివాలయం –2 లో మంగళవారం ఎంఈఓ రామాంజనేయులు, సీఆర్పీలు, గ్రామవలంటీర్లు, సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు . ప్రతి ఒక్క వలంటీర్ తమ క్లస్టర్ పరిధిలో బడి మానేసిన పిల్లలు ఎవరైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పాఠశాలలో చేర్పించే విధంగా సహకరించాలని కోరారు. బడి మానేసిన పిల్లలకు అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చి సమీపంలోని పాఠశాలలో చేర్పించాలని సూచించారు. వర్షం కురుస్తున్నప్పటికీ అధికారులు ఇంటింటి సర్వేను నిర్వహించారు. చదువు మధ్యలో ఆపివేసిన ఇద్దరు పిల్లలను గుర్తించి.. వారికి, తల్లితండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చెంచుగిరిజన పిల్లలు ఎవరైన చదువు మధ్యలో ఆపేసి ఉంటే వారిని బడిలో చేర్పించిన వలంటీర్లకు ఐటీడీఏ తరఫున ప్రోత్సాహక బహుమతిని అందిస్తామని పీఓ తెలిపారు.

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని 4వ సచివాలయం కేంద్రంలో మంగళవారం వలంటీర్లతో గ్రాస్‌ఎంరోల్మెంట్ రేషియో సర్వేపై డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్‌కుమార్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓ శుక్రునాయక్, ఆర్ఐ రవి తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: బడిబయట ఉన్న బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని విస్తరణాధికారి బిఎల్ నాగేంద్రయ్య, తహసీల్దార్ భారతి, మండల విద్యాధికారి సుభాన్, ఎస్ఐ నాగార్జున సూచించారు. మంగళవారం పగిడ్యాల గ్రామసచివాలయంలో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించే విషయమై అవగాహన సదస్సు నిర్వహించారు.

బాలకార్మికులు లేకుండా చేయాలి


జూపాడుబంగ్లా: బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా చేయడంతో పాటు బాలకార్మికులు లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ నూర్జహాన్, ఎంఈఓలు చిన్నమద్దిలేటి, శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మోడల్ పాఠశాలలో జీఈఆర్ సర్వేపై హెచ్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కొత్తపల్లి: గ్రామాలలో ఏ కుటుంబంలోను డ్రాప్‌ఔట్ విద్యార్థులు లేకుండా చూసుకోవాలని ఎంపీడీఓ మేరి, ఎంఈఓ–1 శ్రీరాములు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామవలంటీర్లకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు.

సర్వే రీ చెక్‌చేసుకోవాలి

పాములపాడు: జీఈఆర్(గ్రాస్ ఎన్‌రోల్‌మెంటు రేషియో) వెరిఫికేషన్ టీం రాక ముందే ప్రతి ఇంటిని రీ చెక్ చేసుకోవాలని ఎంపీడీఓ గోపీకృష్ణ, ఎంఈఓ 2 సుభాషిణి దేవి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లకు సమావేశం నిర్వహించారు.


బసవేశ్వరుడికి శ్రీశైలం పీఠాధిపతి పూజలు



బసవేశ్వరుడికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

నంద్యాల(వ్యవసాయం): బైర్మల్‌వీధిలోని శ్రీబసవేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం శ్రీశైలం పీఠాధిపతి 1008 చెన్నసిద్ధరామ శివా చార్య మహాస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ వీరశైవ ఆగమ సలహా దారుడు శ్రీ శశిభూషణ్ సిద్ధాంతి ఆధ్వర్యంలో శివుడికి అభిషేకాలు నిర్వహించి, అనంతరం బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పట్టణ వీరశైవ సంక్షేమ సంఘం నాయకులు స్వామి వారిని ఘనంగా సత్కరించారు.

పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి కర్నూలు జిల్లాలకు చెందిన పాలిటెక్నిక్ కళాశాలల బాలబాలికల ఆటల పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో 11 పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఈఓ రాముడు, జేఎస్ డబ్ల్యూ సిమెంట్ మేనేజర్ లక్ష్మణస్వామి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూ బదలాయింపునకు స్థల పరిశీలన



బానకచెర్ల రెగ్యులేటరు వద్ద నీటి ప్రవాహం గురించి జేసీకి వివరిస్తున్న ఈఈ మనోహర్‌రాజు

పాములపాడు: మండలంలోని యర్రగూడూరు గ్రామం వద్ద భూ బదలాయింపునకు నిర్ణయించిన స్థలాన్ని మంగళవారం జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు వద్ద లూప్ కెనాల్ విస్తరణలో భాగంగా సాగర్ పవర్‌ప్లాంటు కంపెనీకి చెందిన స్థలం కోల్పోయిన ప్రాంతాన్ని సందర్శించారు. లూప్‌కెనాల్ తవ్వకం గురించి, ఎప్పటి నుంచి పనులు జరుగుతున్నాయని, బానకచెర్ల రెగ్యులేటరు సామర్థ్యం, నీటి ప్రవాహ వివరాలను, తెలుగుగంగ, ఎస్కేప్ ఛానల్, జీఎన్ఎస్ఎస్‌ల గురించి ఈఈ మనోహర్ రాజు వివరించారు. అనంతరం జేసీ విలేకరులతో మాట్లాడుతూ సర్వే నెంబరు 507ఏలో సాగర్‌పవర్‌ప్లాంటు కంపెనీకి చెందిన 1.18 ఎకరాల విస్తీర్ణంలో పొలం లూప్‌కెనాల్ విస్తరణలో కోల్పోవడం జరిగిందన్నారు. ఆ కంపెనీ వారికి అదే విలువ గల భూమిని బదలాయించాలని జిల్లా కలెక్టరుకు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఇందుకు గాను యర్రగూడూరు గ్రామం వద్ద సర్వే నెంబరు 414ఏ, 421డీ సర్వే నెంబర్లలో గల 0.34 సెంట్లు స్థలాన్ని ఇవ్వాలని కోరారన్నారు. ఈ మేరకు స్థలం పరిశీలించినట్లు వెల్లడించారు.

న్యాయం చేయండి

అయ్యా మాకు న్యాయం చేయాలని యర్రగూడూరు గ్రామానికి చెందిన రైతు బండ్ల వెంకటరామయ్య అనే రైతు జేసీ ని కోరారు. 1983వ సంవత్సరం ఎస్ఆర్ఎంసీ కాలువ పనుల్లో, విస్తరణలో సర్వే నంబరు 421/డీ లో 18 ఎకరాల పొలం ఉందని, కాగా 3 పర్యాయాలు స్థలం సేకరించారని చివరకు 0.75 సెంట్ల స్థలానికి సంబంధించిన డబ్బులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయం పై పలుమార్లు స్పందనలో అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ విషయం పరిశీలించాలని ఆర్డీఓ, తహసీల్దార్‌లను జేసీ ఆదేశించారు.

భూములు ఇచ్చి ఆదుకోండి

గ్రామానికి చెందిన దళితులు జేసీకి వినతి పత్రం ఇస్తూ అయ్యా 40 సంవత్సరాల నుంచి గ్రామంలో నివసిస్తున్నామని, ఒక్క సెంటు కూడా భూమి లేదని కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నామని వాపోయారు. ప్రతి కుటుంబానికి ఒక ఎకరా చొప్పున పంపిణీ చేయాలని కోరుతూ పలువురు మహిళలు వినతి పత్రం అందజేశారు. జేసీ వెంట ఆర్డీఓ దాసు, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపీకృష్ణ, ఈఈ మనోహర్‌రాజు, డీఈ హరినాథ్‌బాబు, ఏఈఈ విశ్వనాథ్ రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కరువు మండలంగా ప్రకటించండి

ఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో వర్షాలు కురవకపోవడంతో ఆత్మకూరును కరువు మండలంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షుడు మాబాషా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహనాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు లేక పంట ఎండిపోయిందని, 70 ఏళ్ల క్రితం వచ్చిన కరువు మళ్లీ ఈ ఏడాది వచ్చిందని, రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వీరన్న, రామ్‌నాయక్, రణధీర్, నాగేశ్వరరావు, ఆదినారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

కొత్తపల్లి:అధికారులు గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రజాప్రతినిధులతో కలసి సమన్వయంతో పనిచేయాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీడీఓ మేరి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో పంచాయతీ సెక్రటరీలకు, డిజిటల్ అసిస్టెంట్లకు నిధుల వినియోగంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఫైనాన్స్ వ్యవహారాలపై శిక్షణ

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, ఇతర కార్యకలాపాలకు నిధులు ఎలా సద్వినియోగం చేసుకోవాలనే విషయంపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, వీధి దీపాలు, మంచినీరు, రహదారులు, ఇతర అభివృద్ధి పనులు, నిధులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశ భవనంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఒక్క రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ గోపీక్రిష్ణ, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పాలన గురించి, ఆదాయం పెంపు గురించి వివరించారు.

జూపాడుబంగ్లాలో 2.4 మిల్లీమీటర్ల వర్షం

జూపాడుబంగ్లా: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు 2.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. నందికొట్కూరు మండలంలో అత్యధికంగా 9.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో 0.4మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: పట్టణంలోని మిచాంగ్ తుపాను వలన మంగళవారం వేకువజామున స్వల్ప వర్షం కురిసింది. 0.6 మిమీలుగా నమోదయ్యింది. కేవలం ఆత్మకూరు పట్టణంలో మాత్రమే జల్లులు కురవడంతో మినుము, మొక్కజొన్న, పంటలు రైతులు నిరాశ చెందారు. భారీ వర్షం కురుస్తుందని మినుము, మొక్కజొన్న పంటలకు ఊరటనిస్తుందని భావించారు.

రైతులకు దిక్సూచి 'పొలంబడి'



పొలం బడి కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

వెలుగోడు: రైతులకు దిక్సూచిగా డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిలుస్తుందని, రైతులంతా పొలంబడిలో చేరి మేలైన పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని ఏవో పవన్ కుమార్ సూచించారు. మంగళవారం మోత్కూరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ.. రైతులంతా క్రమం తప్పకుండా పొలంబడి కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయంలో నూతన సాంకేతికను అందిపుచ్చుకోవాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా పొలంబడి మానిటరింగ్ అధికారి కళ్యాణ్ కుమార్, ఏఈఓ సుధారాణి, రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ నాగలింగం, వెంకట శివ, లక్ష్మీప్రసన్న, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేల, నీరు జీవనాధారాలు



బహుమతులతో విద్యార్థులు

మహానంది: నేల, నీరు మానవ జీవనానికి ప్రధాన ఆధారమని వాటిని, పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మహానంది వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ అన్నారు. ప్రపంచ మత్తికా దినోత్సవం సందర్భంగా వ్యవసాయ కళాశాలలో మంగళవారం విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేలలను పరిరక్షించుకోవడంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ కవిత, డాక్టర్ గీతా శిరీష, డాక్టర్ ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

నేడు కులగణనపై సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కులగణనపై సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కులగణనకు సంబంధించిన కులసంఘాలు, ఎన్జీఓ, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశానికి కులసంఘాలు, ఎన్జీఓలు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ఈవీఎంల పనితీరు ప్రదర్శనపై సంపూర్ణ శిక్షణ పొంది అన్ని నియోజకవర్గాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈవీఎంల పనితీరుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాడ్ తదితర పరికరాల వినియోగం, ఓటు వేసే విధానం తదితర అంశాల్లో సంపూర్ణ శిక్షణ పొందాలన్నారు. శిక్షణ పొందిన అంశాలను ఈఆర్ఓ, ఏఈఆర్ఓల ఆధ్వర్యంలో ప్రతి మండలంలోని పోలింగ్ కేంద్ర పరిధిలోని ప్రజల్లో సంపూర్ణ అవగాహన తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ పుల్లయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు, స్వీప్ నోడల్ అధికారి పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మానవీయ విలువలను కాపాడుకుందాం

నంద్యాల(న్యూటౌన్): కనుమరుగవుతున్న మానవీయ విలువలను కాపాడుకుందామని ఏపీ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఇప్టా పాదయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్ మాట్లాడుతూ డిసెంబర్ 18 నుండి గుంటూరులో పాదయాత్రలు ప్రారంభమై విజయవాడలో 22వ తేదీన బహిరంగ సభతో ముగుస్తాయన్నారు. సమావేశంలో ఏపీ ప్రజా నాట్య మండలి నంద్యాల జిల్లా కార్యదర్శి శివయ్య, కళాకారులు విజయ్, విష్ణు, కరీం, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణలో జాప్యం వద్దు



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ

నంద్యాల టౌన్: వ్యాధి నిర్ధారణలో జాప్యం లేకుండా చూడాలని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకట రమణ అన్నారు. మంగళవారం స్థానిక సర్వజన ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్స్, సబ్ యూనిట్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాథమిక వైద్య కేంద్రాల్లో శాంపిళ్లను పక్కాగా పరీక్షించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండ రిపోర్టులు ఇవ్వాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే వారి వివరాలు నమోదు చేయాలన్నారు. జిల్లా మలేరియా అధికారి కామేశ్వర రావు పాల్గొన్నారు.